క్లుప్తంగా

ఎఫ్‌ఆర్‌ఎస్‌లో హాజరు నమోదు చేయాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఆడే ప్రకాశ్

కెరమెరి: ఉపాధ్యాయులు ప్రతీరోజు ఉదయం 9:15 లోపు ఎఫ్‌ఆర్‌ఎస్‌లో తమ హాజరు నమోదు చేయాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. బుధవారం సాంగ్వి, పెద్ద సాకడ గ్రామాల్లోని పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పరిశీలించారు. డ్రాప్‌బాక్స్‌లో ఉన్న విద్యార్థులను క్లియర్ చేయాలని సూచించారు. సామర్థ్యం ఆధారంగా విద్యాబోధన చేయాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వాంకిడి: ఆసిఫాబాద్(బెండార) ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకుల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కనకయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు-1, ఇంగ్లిష్-1, కామర్స్-1, చరిత్ర-1, గణితశాస్త్రం-1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, పీజీ విద్యార్హతతో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం, ఇతరులు 55 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 23న సాయంత్రం 4 గంటలలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయునికి సన్మానం



రాజేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

వాంకిడి: మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు వడ్లూరి రాజేశ్ విద్యాభివృద్ధికి చేస్తున్న కృషికి గుర్తింపుగా ఇటీవల డాక్టరేట్ అవార్డు పొందారు. బుధవారం మండలంలోని దళిత సంఘాల నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో బోధిస్తున్న ఉపాధ్యాయులు రాజేశ్‌ను ఆదర్శంగా తీసుకుని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం, భారతీయ బౌద్ధ మహాసభ, సిద్దార్థ యువజన సంఘం, సమతా సైనిక్ దళ్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు పనులు చేపట్టాలి

కాగజ్‌నగర్‌రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ క్షేత్రసహాయకులు, సాంకేతిక సహాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఉపాధిహామీ పనులను రికార్డులను, హాజరు పట్టికలు, కూలీలకు అందించే కూలీ డబ్బుల వివరాలను రికార్డుల్లో పొందుపర్చాలన్నారు. ఏపీవో చంద్రశేఖర్, ఉపాధిహామీ క్షేత్రసహాయకులు, సాంకేతిక సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు దరఖాస్తు చేసుకోవాలి

చింతలమానెపల్లి: మండలంలోని రైతులు వ్యవసాయ యంత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కార్తీశ తెలిపారు. ఎస్‌ఎంఏఎం పథకం కింద మండలంలోని రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, రోటవేటర్, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్, కల్టివేటర్, పవర్ వీడర్, బ్రష్ కట్టర్, పవర్ టిల్లర్ మంజూరైనట్లు వివరించారు. రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డ్, ఫొటోలు, ట్రాక్టర్ పనిముట్ల కోసం ట్రాక్టర్ రిజిస్ట్రేషన్ కాపీలతో సంప్రదించాలని సూచించారు.

సిర్పూర్(టి): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీ కింద అందజేస్తున్న వ్యవసాయ సామగ్రిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి గిరీష్ ఒక ప్రకటనలో తెలిపారు. సిర్పూర్(టి) మండలానికి బ్యాటరీ స్ప్రేయర్లు 178, పవర్ స్ప్రేయర్లు 31, రోటవేటర్ 12, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్ 2, కల్టివేటర్ 12, పవర్ వీడర్ 1, బ్రష్ కట్టర్ 2, పవర్ టిల్లర్ 2 మంజూరయ్యాయని ఆయన తెలిపారు.

రవీంద్రనగర్ కారోబార్ మృతి

చింతలమానెపల్లి: మండలంలోని రవీంద్రనగర్ 1 కారోబార్‌గా విధులు నిర్వహిస్తున్న అశోక్ మండల్ బుధవారం మృతి చెందాడు. అశోక్ మండల్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. బుధవారం ఆరోగ్యం విషమించడంతో ఇంటి వద్ద మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, మండలంలోని కారోబార్లు, పారిశుధ్య కార్మికులు పరామర్శించారు. ప్రభుత్వం తరపున రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

తాళాలు తెరవక.. వైద్య సేవలందక!

ఈ సబ్ సెంటర్ భవనం మండలంలోని తుమ్మగూడకు చెందినది. జిల్లా పరిషత్ నిధులు రూ.20 లక్షలతో టెండర్ వేయగా 12.7 శాతం తగ్గుదలతో ధనోరాకు చెందిన గుత్తేదార్లు దీన్ని నిర్మించారు. కానీ వారికి కేవలం రూ.7 లక్షలు మాత్రమే అందడంతో దాన్ని వైద్యశాఖకు అప్పగించలేదు. మిగిలిన బిల్లులు వస్తే తప్పా సబ్‌సెంటర్‌ను అప్పగించేది లేదని సదరు గుత్తేదారు పేర్కొంటున్నాడు.





ప్రారంభానికి నోచుకోని పరంధోళి సబ్ సెంటర్

- అలంకారప్రాయంగా సబ్‌సెంటర్లు
- ఇబ్బందులు పడుతున్న రోగులు
- చొరవ చూపని ప్రభుత్వం

కెరమెరి: మండలంలో వారం రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. వ్యాధుల విజృంభణ కూడా అదేస్థాయిలో ఉండే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లోని రోగులకు వైద్య సేవలందించేందుకు నిర్మాణం చేపట్టిన ఆరోగ్య ఉపకేంద్రాలు సేవలకు నోచుకోవడం లేదు. నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా.. ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో గుత్తేదార్లు వీటిని వైద్య ఆరోగ్య శాఖకు అప్పగించడం లేదు. దీంతో లక్షలు వెచ్చించి నిర్మించినా నిరుపయోగంగానే మారాయి. బకాయిల విడుదలలో ప్రభుత్వం జాప్యం చేస్తుండడంతో అవి అలంకార ప్రాయంగా నిలిచాయి. ఇటు అధికారులు, అటు ప్రభుత్వం సబ్‌సెంటర్లపై ఎలాంటి చొరవ చూపకపోవడంతో తాళాలు తెరవడం లేదు.

బిల్లులు రాక..హ్యాండోవర్ చేయక

పరంధోళి గ్రామంలో ఎన్‌ఆర్‌హెచ్‌ఎం పథకం కింద రూ.16 లక్షల నిధులతో సబ్‌సెంటర్ భవనం నిర్మించారు. ఇప్పటి వరకు గుత్తేదారుకు రూ.12 లక్షల బిల్లు మాత్రమే అందింది. మిగిలిన బిల్లులు అందేవరకు హ్యాండోవర్ చేసేది లేదని పేర్కొంటున్నారు. తుమ్మగూడలో రూ.20 లక్షల జిల్లా పరిషత్ నిధులతో నిర్మాణం చేపట్టగా కేవలం రూ.7 లక్షలే అందాయి. తమ వద్ద డబ్బులు లేకున్నా ఇతరుల వద్ద అప్పులు చేసి భవనాలు నిర్మిస్తే నెలలు గడుస్తున్నా బిల్లులు అందడం లేదని గుత్తేదారులు వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వైద్యశాఖకు భవనాలు అప్పగిస్తే బిల్లులు అందించడంలో మరింత జాప్యం జరిగే అవకాశం ఉందని గుత్తేదారులు పేర్కొంటున్నారు.

వైద్యసేవలు ప్రారంభించాలి



పరంధోళిలో వైద్య సేవలు ప్రారంభిస్తే రోగులకు ఎంతో సులువుగా ఉంటుంది. ఇప్పుడు ఏ చిన్న జబ్బుకైనా 25 కిలో మీటర్ల దూరంలో ఉన్న కెరమెరి పీహెచ్‌సీకి వెళ్లాల్సి వస్తోంది. 4 వేల మంది జనాభా, 15 గ్రామాలకు ఒకే ఏఎన్‌ఎం ఉన్నారు. మరో ఏఎన్‌ఎంను నియమించాలి. గుత్తేదార్లకు బిల్లులు చెల్లించి ఇదే భవనంలో వైద్య సేవలు ప్రారంభించాలి.

– కాంబ్డె లక్ష్మణ్, మాజీ సర్పంచ్, పరంధోళి

వైద్యం అందేదెలా..?

మండలంలోని మొత్తం ఎనిమిది ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఇప్పటికే ఆరింటిలో పక్కా భవనాలు ఉన్నప్పటికీ పరంధోళి, దేవాపూర్ సబ్‌సెంటర్లలో కొన్ని మాసాల క్రితమే నూతనంగా భవనాలు నిర్మించారు. దేవాపూర్ సబ్‌సెంటర్లో జైరాంగూడ, ఖట్టిగూడ, కొలాంగూడ, చిత్తగూడ, టిప్లగూడ, సామ్లగూడ, తుమ్మగూడ, అనార్‌పల్లి, బొగడగూడ, లక్మాపూర్, జైరాగూడ, జన్కాపూర్, పెద్దకరంజివాడ, బోరిలాల్‌గూడ, గోండ్‌గూడ గ్రామాలు ఉండగా 4,132 జనాభా నివాసం ఉంటున్నారు. 36 మంది గర్భిణులు, 28 మంది బాలింతలు ఉన్నారు. వారికి వైద్యసేవలు అందించేందుకు ఇద్దరు ఏఎన్‌ఎంలు విధులు నిర్వహిస్తున్నారు. పరంధోళి సబ్‌సెంటర్లో పరంధోళి, తాండ, కోటా, లేండిజాల, శంకర్‌లొద్ది, ముకదంగూడ, మహరాజ్‌గూడ, అంతాపూర్, ఇంద్రానగర్, పద్మావతి, ఏసాపూర్, నారాయణగూడ, భోలాపటార్, లేండిగూడ, గౌరీ గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో 36 మంది గర్భిణులు, 26 మంది బాలింతలు ఉన్నారు. ఇక్కడ 15 గ్రామాలకు ఒకే ఏఎన్‌ఎం ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఆయా గ్రామాలకు వెళ్లాలంటే వాగులు, కల్వర్టులు అనేకం ఉన్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సబ్‌సెంటర్లు ఉంటే ఉద్యోగులు ఇక్కడే ఉండి వైద్య సేవలు అందించే ఆస్కారం ఉండేది.

కొనసాగుతున్న ఎమ్మెల్యే దీక్ష



దీక్షకు మద్దతు తెలుపుతున్న నాయకులు



సిర్పూర్(టి)లో దీక్ష చేస్తున్న బీజేపీ నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు జీవో 49 రద్దు చేయాలని తలపెట్టిన నిరవధిక నిరాహార దీక్ష బుధవారం మూడో రోజుకు చేరింది. దీక్ష చేస్తున్న ఎమ్మెల్యేను మంచిర్యాల జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, దుర్గం అశోక్, బెజ్జూరు చేనేత సహకార సంఘం కార్మికులు, పట్టణ, మండల బీజేపీ నాయకులు కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌బాబు మాట్లాడుతూ జీవో నెం 49, పోడు రైతుల సమస్యలపై జిల్లా పర్యటనలో ఉన్న ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): జీవో నం.49ను ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు తన నివాసంలో చేపడుతున్న సత్యాగ్రహ దీక్షకు మద్దతుగా బుధవారం మండల బీజేపీ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. బీజేపీ మండల అధ్యక్షురాలు చన్కపురె లావణ్య ఆధ్వర్యంలో నాయకులు దీక్షలో పాల్గొని తమ నిరసన వ్యక్తం చేశారు. ఇందులో బీజేపీ మండల నాయకులు నీరటి సత్యనారాయణ, వడ్డేటి నానయ్య, నేరెళ్ల అశోక్, ఎల్ములే శంకర్, రాచర్ల మహేశ్, గద్దం రంగన్న, అశోక్ ఆర్య, బనార్కర్ సాయి, దుర్గం ప్రశాంత్, దివాకర్, కిర్మరే శ్యాంరావ్, నులిగొండ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు చేపట్టిన సత్యాగ్రహ దీక్ష శిబిరాన్ని సందర్శించి బుధవారం మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేసరి ఆంజనేయులుగౌడ్ మద్దతు తెలిపారు. బీజేపీ జిల్లా నాయకులు నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లోలెవల్ వంతెనకు మరమ్మతులు

వాంకిడి: మండలంలోని ఖమాన గ్రామంలో గల లోలెవల్ వంతెనకు బుధవారం గ్రామస్తులు మరమ్మతులు చేయించారు. ఇటీవల కురిసిన వర్షానికి వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు ధ్వంసమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. దీంతో అఖిల గాండ్ల కుల గ్రామశాఖ అధ్యక్షుడు లోబడె పెంటు, బీజేపీ మండల అధ్యక్షుడు చీడర్ల నరేష్ సొంత డబ్బులతో జేసీబీ ద్వారా మరమ్మతులు చేయించారు. నాలుగు రోజుల నుంచి ఉన్న ఈ సమస్యను గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనా పనులు చేపట్టకపోవడంతో ఏటా వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి హైలెవెల్ వంతెన నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



జేసీబీతో మరమ్మతులు చేయిస్తున్న గ్రామస్తులు

'పని భారం తగ్గించాలి'

కౌటాల: ఐకేపీలో క్షేత్రస్థాయిలో పని చేస్తున్న వీవోఏలకు పనిభారం తగ్గించాలని కోరుతూ బుధవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం వినేశ్‌రావ్‌కు వీఓఏలు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ సెర్ప్ సంస్థ తమకు చాలీచాలనీ వేతనాలు ఇస్తూ 67 రకాల పనులు చేయిస్తుందన్నారు. వీఓఏలు వెంకటేశ్, దత్తు, రవి, భీంరావ్, సురేష్, కొండయ్య, కరుణకార్‌గౌడ్, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతుల వెల్లువ



ఆసిఫాబాద్‌రూరల్: వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని, మెడికల్ కళాశాలకు బాపూజీ పేరు పెట్టాలని కోరుతూ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ మంత్రి సానుకులంగా స్పందించారని, సొంత నిధులతో విగ్రహం ఏర్పాటు చేస్తామని తెలిపారు. శ్రీకాంత్, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని..

ఆసిఫాబాద్‌అర్బన్: జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని కోరుతూ జిల్లా కేంద్రానికి వచ్చిన ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అబ్దుల్ రహమాన్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావ్, టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి సంతప్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు ప్రకాష్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం పూర్తి చేయాలని..

కెరమెరి: మండలంలోని లక్మాపూర్ గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న వాగుపై అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణం పూర్తి చేయాలని కోరుతూ గ్రామస్తులు మంత్రిని కోరారు. బుధవారం ఆసిఫాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2015–16లో ప్రారంభమైన వంతెన నేటికీ పూర్తికాలేదన్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామస్తులు బలిరాం, రవినాయక్, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

పేపరు మిల్లులో ఎన్నికలు నిర్వహించాలని..

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ పేపర్ మిల్లు మజ్దూర్ యూనియన్ రిజి నెం–2510 ఆధ్వర్యంలో నాయకులు సిర్పూరు పేపరు మిల్లులో కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలను బ్యాలెట్ ద్వారా నిర్వహించాలని ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. మిల్లు మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ కూశన రాజన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్, దుర్గ దినకర్, కార్తీక్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కాగజ్‌నగర్‌టౌన్: సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బీజేపీ పట్టణ అధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ ఉపయోగపడుతుందన్నారు. అర్హులైన వారు సీఎం రిలీఫండ్‌కు దరఖాస్తు చేసుకుంటే లబ్ధిదారులకు అందే విధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు సదానందం, ప్రధాన కార్యదర్శి చేరాల శ్రీనివాస్, జిల్లా మహిళ మోర్చ శ్రీదేవి, గజ్జెల లక్ష్మణ్, బాబురావు, దెబ్బటి శ్రీను, అర్జున్, కిరణ్, పోచం పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రంలో బుధవారం బీజేపీ నాయకులు సీఎం రీలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి రాజేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు కుంచాల విజయ్, నాయకులు పాల్గొన్నారు.

నీట మునిగిన పంటలు

బెజ్జూర్: గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రాణహిత నది ఉప్పొంగడంతో పంటలు నీట మునిగాయి. బుధవారం మండలంలోని సోమిని, మొగవెల్లి, పాపన్నపేట్, తలాయి, తిక్కపల్లి, భీమారం తదితర గ్రామాలకు చెందిన రైతులు వేసుకున్న పంట పొలాల్లో వరదనీరు చేరింది. దీంతో పంటలు పూర్తిగా నీట మునిగిపోయాయి. గతంలో సైతం బ్యాక్ వాటర్ చేరి నష్టాల పాలయ్యారు. పంట నష్ట పరిహారం ఇవ్వడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెంచికల్‌పేట్: పెద్దవాగు వరదలతో మండలంలో సుమారు 1300 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు పెంచికల్‌పేట్ మండల వ్యవసాయ అధికారి మనీషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అగర్‌గూడ, గుండెపల్లి, కమ్మర్‌గాం, నందిగామ, మురళీగూడ, జిల్లెడ గ్రామాల్లో నష్టపోయిన పంటల వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు.

టీబీజీకేఎస్ సమావేశానికి తరలిన నాయకులు

రెబ్బెన: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం నిర్వహించిన టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ సమావేశానికి బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావుతో పాటు కేంద్ర కమిటీ సభ్యులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. సమావేశానికి తరలివెళ్లిన వారిలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ దారావత్ మంగీలాల్, నాయకులు సత్యనారాయణ, సమ్మయ్య, తదితరులు ఉన్నారు.

సీపీఎస్ రద్దు చేసే వరకు పోరాటం

రెబ్బెన: ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే వరకు పోరాడుతామని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించ తలపెట్టిన మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్నాకు జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బత్తుల సదానందం, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్ఞానేశ్వర్, కార్యదర్శి రవీందర్, మండల ఉపాధ్యక్షుడు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య రక్షణకు పరిశుభ్రత పాటించాలి

చింతలమానెపల్లి: ఆరోగ్య రక్షణకు పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారి అజ్మీర రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని రవీంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల నుంచి రక్త నమూనాలు సేకరించి మందులు అందజేశారు. వైద్యాధికారి రాజ్ కుమార్ మాట్లాడుతూ వర్షాకాలంలో పలు రకాల వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఉంటాయని తెలిపారు. వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

'ఉల్లాస్'తో వయోజనులకు విద్య

కెరమెరి: వయోజనులకు విద్య నేర్పించేందుకు ప్రభుత్వం 'ఉల్లాస్' పేరుతో బృహత్తర కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని ఎంఈవో ఆడే ప్రకాశ్, ఏపీఎం ముక్తేశ్వర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, వీవో సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 15 సంవత్సరాలు పైబడిన వారిని అక్షరాస్యులుగా తీర్చి దిద్దడమే కార్యక్రమం లక్ష్యమన్నారు. నాలుగు నెలల్లో 200 గంటలు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, బోధనకు ప్రత్యేక వలంటీర్‌ను నియమిస్తారన్నారు.

లింగాపూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం ఐకేపీ సిబ్బందితో పాటు పాఠశాల ఉపాధ్యాయులకు ఉల్లాస్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ 15 సంవత్సరాలు పైబడిన నిరక్షరాశ్యులను అక్షరాశ్యులుగా తీర్చిదిద్దడమే కార్యక్రమం ముఖ్య లక్ష్యమన్నారు.

పెంచికల్‌పేట్: వయోజన విద్యను ప్రోత్సహించడానికి ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమంలో భాగంగా పెంచికల్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులకు, వీవోఏలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వయోజన విద్యను ప్రోత్సహించడంలో ఐకేపీ సిబ్బంది, ఉపాధ్యాయుల పాత్రను తెలియజేశారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం అశోక్, ఆర్పీలు శ్రీధర్, తిరుమల్ గౌడ్, సీఆర్పీలు శ్రీనివాస్, శ్యాంసుందర్, ఉపాధ్యాయులు, వీవోఏలు పాల్గొన్నారు.



పెంచికల్‌పేట్: అవగాహన కల్పిస్తున్న ఆర్పీలు



కెరమెరి: మాట్లాడుతున్న ఎంఈవో ఆడే ప్రకాశ్

కౌటాల: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో బుధవారం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలోని వీఓఏలకు ఉల్లాస్ నవభారత సాక్షరాత కార్యక్రమంపై రిసోర్స్ పర్సన్‌లు సునీల్, శివాజీలు శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్, ఎంఈవో హన్మంతు, ఏపీఎంలు నాగరాజు, వినేశ్‌రావ్, సీసీలు కుసుమ, విలాస్, సీఆర్పీలు ప్రకాశ్, దేవన్న పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలంలోని గ్రామాల్లో బడి మానేసిన చిన్నారులు, పెద్దలను గుర్తించి తిరిగి చదువుకునేలా చూడాలని ఎంఈవో వేణుగోపాల్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ఆశ్రమ బాలికల పాఠశాలలో నవభారత్ సాక్షరత ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా రిసోర్స్ పర్సన్‌లకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కోఆర్డినేటర్ కటకం మధుకర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ నాగరాజు, ఐకేపీ ఏపీఎం మహేశ్, రిసోర్స్ పర్సన్‌లు మహేశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని జిల్లా వయోజన విద్య కోఆర్డినేటర్ నాగరాజు అన్నారు. పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంపై ఎంఈవో వాసాల ప్రభాకర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, స్వయం సహాయక సభ్యులకు ఒకరోజు శిక్షణ అందించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు సుందిల్ల రమేశ్, జితునాయక్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

దహెగాంలో మంత్రి పర్యటన రద్దు

దహెగాం(సిర్పూర్): దహెగాం మండలంలో భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటలు, ముంపు ప్రాంతాల పరిశీలన కోసం ఖరారైన మంత్రి పర్యటన రద్దయింది. ఉదయం నుంచి అధికారులు, పోలీసుల హడావుడి ఉండటంతో మంత్రికి సమస్యలు తెలిపేందుకు మండల కేంద్రంతోపాటు, పెసరికుంట, హత్తిని గ్రామాల్లో ప్రజలు ఎదురుచూశారు. పర్యటన రద్దు కావడంతో ముంపు ప్రాంతాల రైతులు నిరుత్సాహపడ్డారు. పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

తాత్కాలిక రోడ్డు ఏర్పాటు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని అందవెల్లి –భట్టుపల్లి గ్రామాల మధ్యన రోడ్డు వర్షాలతో బురదమయం కావడంతో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, జెడ్పీ మాజీ చైర్మన్ కోనేరు కృష్ణారావుల ఆధ్వర్యంలో ట్రాక్టర్ ఓనర్స్, డ్రైవర్స్ కలిసి గుంతలమయ రోడ్డులో మట్టి వేసి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. దీంతో అందవెల్లి, భట్టుపల్లి గ్రామాల ప్రజల ఇబ్బందులు తాత్కాలికంగా తొలగిపోయాయని హర్షం వ్యక్తం చేశారు.

మాజీ మంత్రి పరామర్శ



నివాళులర్పిస్తున్న అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఘనపురం శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా ఆయన నివాసానికి మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి బుధవారం వచ్చి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వీరి వెంట పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, కాసం శ్రీనివాస్, కలికోట రమణయ్య ఉన్నారు.

108లో ప్రసవం



శిశువును అప్పగిస్తున్న సిబ్బంది

వాంకిడి: మండలంలోని ఖిరిడి గ్రామానికి చెందిన అదె వసంతకు బుధవారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. వాహనాన్ని తేజిగూడ గ్రామ శివారులో ఆపి 108 సిబ్బంది ప్రసవం చేయగా ఆడశిశువుకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డను వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఈఎంటీ సంతోశ్, పైలెట్ భీంరావు తెలిపారు.

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

వాంకిడి: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ మాట్లాడుతూ ప్రధానిగా రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మండోకర్ అనిల్ కుమార్, జబోరె గణేశ్, దాదాజీ, సెల్వట్‌కార్ పెంటు, రత్నం తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.